రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో కళావతీబాయి

పీహెచ్‌సీల్లో ప్రసవాల సంఖ్య పెంచాలి

డీఎంహెచ్‌వో కళావతీబాయి

చిన్నగూడూరు జూన్ 4: ప్రభుత్వ వైద్యశాలల్లో ప్రసవాల సంఖ్యను పెంచేందుకు వైద్య సిబ్బంది పాటుపడాలని డీఎంహెచ్‌వో కళావతీబాయి సూచించారు. మంగళవారం ఆమె మండలంలోని ఉగ్గంపల్లి పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. సిబ్బంది సమయపాలనపై ఆరా తీశారు. తాత్కాలిక కుటుంబ నియంత్రణ పద్ధతులు, సురక్షిత గర్భస్రావాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. పీహెచ్‌సీల్లో ఓపీల సంఖ్యను పెంచాలన్నారు. వానకాలం ప్రారంభమైనందున సీజనల్ వ్యాధుల నియంత్రణ, పరిశుభ్రతపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. గర్భిణులు, బాలింతలకు వారాంతపు పరీక్షలు తప్పకుండా నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్, సిబ్బంది మంగమ్మ, రాధాకుమారి, మాధవి, సుమలత, తార, ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ సంబురాల్లో అపశ్రుతి

డోర్నకల్, జూన్ 4: మహబూబాబాద్ పార్లమెంట్ స్థానంలో కాంగ్రెస్ గెలుపొందడంతో డోర్నకల్ పట్టణంలోని గాంధీ సెంటర్‌లో ఆ పార్టీ నాయకులు మంగళవారం పటాకులు కాల్చి సంబురాలు జరుపుకున్నారు. ఈ క్రమంలో ఓ కాంగ్రెస్ కార్యకర్తకు చేతిలో పటాకు పేలడంతో స్వల్పగాయాలయ్యాయి. స్థానిక దవాఖానలో ప్రథమ చికిత్స అనంతరం ఖమ్మం వైద్యశాలకు తరలించారు.

ఉరేసుకొని ఒకరి ఆత్మహత్య

డోర్నకల్, జూన్ 4 : ఉరేసుకొని ఒకరు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన డోర్నకల్ మున్సిపాలిటీ పరిధిలోని సిగ్నల్ తండాలో సోమవారం జరిగింది. ఏఎస్సై కోటేశ్వరరావు కథనం ప్రకారం.. డోర్నకల్ మున్సిపాలిటీ పరిధిలోని సిగ్నల్ తండాకు చెందిన బానోత్ భోజ్యా (40) అప్పుల బాధ భరించలేక సోమవారం సాయంత్రం ఇంట్లో చీరతో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భోజ్యాకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. అతడి కొడుకు దిలీప్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై తెలిపారు.

లక్ష్మీనారాయణ స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

లక్ష్మీనారాయణకు నివాళి

గార్ల, జూన్ 4 : సీపీఐ మండల మాజీ కార్యదర్శి ఎల్లంకి లక్ష్మీనారాయణ 4వ వర్ధంతిని మంగళవారం రాంపురం గ్రామంలో నిర్వహించారు. ఆయన స్తూపానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు కట్టెబోయిన శ్రీనివాస్, మండల కార్యదర్శి జంపాల వెంకన్న, రాగం రమేశ్, రాగం కృష్ణయ్య, నగేశ్, ఉపేందర్ రెడ్డి పాల్గొన్నారు.

కృష్ణా ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణికుల రద్దీ

డోర్నకల్, జూన్ 4: ఆదిలాబాద్ –తిరుపతి కృష్ణా ఎక్స్‌ప్రెస్ రైలు మంగళవారం తిరుపతికి వెళ్లే ప్రయాణికులతో కిటకిటలాడింది. విద్యార్థులకు వేసవి సెలవులు ముగుస్తుండడంతో రాజుతండా, బర్లగూడెం నుంచి ఎక్కువ సంఖ్యలో భక్తులు తిరుపతి వేంకటేశ్వరస్వామి దర్శనానికి బయలుదేరి వెళ్లారు. దీంతో రైలు ప్రయాణికులతో కిక్కిరిసింది.

రాకపోకలకు మళ్లీ ఇబ్బందులే..

- గత వానకాలంలో శిథిలమైన రాళ్లవాగు బ్రిడ్జి
- టెండర్లు పూర్తయినా ప్రారంభం కాని పనులు
- కొద్ది రోజుల్లో కురవనున్న వానలు
- 10 గ్రామాలకు నిలిచిపోనున్న రవాణా
- అధికారుల నిర్లక్ష్యంతో తప్పని తిప్పలు

2023లో రాళ్లవాగు వద్ద ఏర్పడిన బుంగను పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలాత్రిపాఠి (ఫైల్)

ములుగు, జూన్ 4 (నమస్తే తెలంగాణ): అధికారుల నిర్లక్ష్యం వల్ల ఈ వానకాలంలో ప్రజలకు రాకపోకలకు తిప్పలు తప్పేలా లేవు. ఎండాకాలంలో రోడ్ల మరమ్మతు లు చేపట్టకపోవడంతో ఇబ్బందులు పడే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఎన్నికల కోడ్‌ను అడ్డం పెట్టుకొని అధికారు లు గాలికి వదిలేశారు. గత వానకాలంలో వరద ఉధృతికి దెబ్బతికి శిథిలమైన రాళ్లవాగు బ్రిడ్జి ప్రస్తుతం ప్రమాదకరంగా ఉంది. కొద్ది రోజుల్లో వర్షాకాలం ప్రారంభం కానుంది. జిల్లా కేంద్రం నుంచి బండారుపల్లి మీదుగా బుద్దారం నుంచి జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు వెళ్లే మార్గంలో ఉన్న ఈ వాగు బ్రిడ్జి రామప్ప సరస్సులో వరద ఉధృతికి దెబ్బతిన్నది. గత వానకాలంలో జూలైలో కురిసిన భారీ వర్షాలకు రాళ్లవాగు బ్రిడ్జి వద్ద బుంగ ఏర్పడి రెండు నెలల పాటు రాకపోకలు నిలిచాయి. ఈ బ్రిడ్జి మీదుగా ములుగు, వెంకటాపూర్ మండలాల్లో 10 గ్రామాలకు చెందిన ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. నిరుడు కురిసిన వర్షాల కారణంగా సదరు గ్రామాల ప్రజలు ప్రమాదాల బారిన పడకుండా బ్రిడ్జిని మూసేయడంతో రెండు నెలలపాటు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ క్రమంలో సింగరికుంటపల్లి, పాపయ్యపల్లి, నర్సాపూర్, తిమ్మాపూర్, రాజేశ్వర్‌రావుపల్లి, బుద్దారం, గణపురం వైపు వెళ్లాల్సిన వాహనదారులు ములుగు నుంచి వెంకటాపూర్ మండల కేంద్రం మీదుగా పాలంపేట నుంచి దూర ప్రయాణం చేయాల్సి వచ్చింది. ఆ సమయంలో పాలంపేట సమీపంలోని వాగునీటి ప్రవాహం ఎక్కువ కావడంతో కొన్ని గ్రామాలకు రాకపోకలు నిలిచాయి. ప్రస్తుతం రాళ్లవాగు బ్రిడ్జిని తాత్కాలిక మరమ్మతులు చేపట్టి రాకపోకలు కొనసాగిస్తుండగా భారీ వాహనాలతో బ్రిడ్జి గతంలో కంటే మరింత ప్రమాదకరంగా తయారైంది.

టెండర్లు పూర్తయినా..

2023 జూలైలో కురిసిన భారీ వర్షాలకు రాళ్లవాగు బ్రిడ్జి వద్ద బుంగ ఏర్పడి ప్రమాదంగా మారగా అప్పటి ప్రభుత్వం నూతన బ్రిడ్జి నిర్మాణానికి నిధులను కేటాయించింది. రోడ్లు, భవనాలశాఖ ఆధ్వర్యంలో బ్రిడ్జి నిర్మాణానికి టెండర్లు పిలువగా ఓ కాంట్రాక్టర్ పనులు దక్కించుకున్నాడు. ఈ క్రమంలో ఎన్నికల హడావిడి మొదలు కాగా పనులను ప్రారంభించకుండా కాలయాపన చేశాడు. ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు నిర్లక్ష్యం వల్ల కాంట్రాక్టర్ రాళ్లవాగు బ్రిడ్జి వద్ద ఎలాంటి నిర్మాణం చేపట్టలేదు. ఇటీవల బ్రిడ్జి పక్కనుంచి వాహనాలను పంపేందుకు మట్టితో అప్రోచ్ రోడ్డు పనులు చేపట్టాడు. అధికారులు, కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో గత ఏడాది వానకాలంలో ఎదురైన కష్టాలే ఈ వానకాలంలో ఎదురు కానున్నాయి. ఈ విషయమై ఆర్‌అండ్‌బీ అధికారులను వివరణ కోరగా కాంట్రాక్టర్ పనులు చేపట్టడంలో ఆలస్యం చేయగా ఇప్పటికే రెండు సార్లు నోటీసులు జారీ చేశామని, ఎన్నికల కోడ్ తర్వాత కలెక్టర్‌తో చర్చించి టెండర్లను రద్దు చేసి అంచనాలు పెంచి మళ్లీ టెండర్ పిలుస్తామని తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

చిన్నగూడూరు జూన్4: మండల కేంద్రం శివారు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌నుమంగళవా రం పోలీసులు పట్టుకున్నారు.ఎస్సై ఝాన్సీ మాట్లాడారు. ఆకేరు నుంచి అక్రమంగా ఇసుకను రవాణా చేస్తే కఠిన చర్యలు ఉంటాయన్నారు. ట్రాక్టర్‌ను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

దంతాలపల్లి, జూన్ 4: విద్యుదాఘాతంతో గేదె మృతి చెందిన ఘటన మండలంలో మంగళవారం జరిగింది. మండలంలోని కుమ్మరికుంట్ల గ్రామానికి చెందిన వెంకన్న తన గేదెను మేతకు వ్యవసాయ బోరుబావి వద్దకు తీసుకెళ్లాడు. మేత మేస్తున్న క్రమంలో విద్యుత్ తీగలు తగిలి గేదె అక్కడికక్కడే మృతి చెందింది. గేదె విలువ సుమారు రూ.60వేలు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని వెంకన్న కోరాడు.

మృతి చెందిన గేదె

మరింత ఉత్సాహంతో పనిచేస్తాం..

ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి

ఎంపీగా గెలిచిన కడియం కావ్యను అభినందిస్తున్న ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి, నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఝాన్సీరెడ్డి

తొర్రూరు, జూన్ 4: వరంగల్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్యను భారీ మెజార్టీతో విజయం సాధించడంలో పాలకుర్తి నియోజకవర్గం తనదైన పాత్రను పోషించిందని ఎమ్మెల్యే మామిడాల యశస్వినీరెడ్డి అన్నారు. తొర్రూరులో మంగళవారం నియోజకవర్గ ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీరెడ్డితో కలిసి ఆమె మాట్లాడారు. కావ్య గెలుపు పాలకుర్తి నియోజకవర్గ అభివృద్ధికి మలుపు అని, ఎంపీగా మంచి మెజార్టీని అందించిన ప్రజలకు, విజయానికి కష్టపడిన కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. పార్లమెంట్ నిధులతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసే అవకాశం కలిసి వచ్చిందని, అసెంబ్లీ ఎన్నికల కంటే మంచి ఫలితాలను నియోజకవర్గంలో కాంగ్రెస్‌కు అందించినట్లు తెలిపారు. ఈ ఉత్సాహంతో నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో నేతలు హనుమాండ్ల తిరుపతిరెడ్డి, హమ్యానాయక్, మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య, వైస్ చైర్మన్ జినుగ సురేందర్‌రెడ్డి, సుంచు సంతోష్, సోమ రాజశేఖర్ పాల్గొన్నారు.

సమాన పనికి సమాన వేతనం అందించాలి

సమావేశంలో మాట్లాడుతున్న ఐఎఫ్‌టీయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి రామయ్య

మహబూబాబాద్ రూరల్, జూన్ 4 : దేశంలోని కార్మిక వర్గానికి సమాన పనికి సమాన వేతనం అందించాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర సహాయ కార్యదర్శి జీ రామయ్య అన్నారు. మంగళవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరగడంతో కార్మిక వర్గానికి తీవ్ర నష్టం జరుగుతున్నదని, కార్మికుల కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని కోరారు. నూతన లేబర్ కోడ్ విధానాలతో కార్మికులు ఇబ్బంది పడుతున్నారని, కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న సెలవులను సైతం రద్దు చేయడం సరికాదన్నారు.ఈ కార్యక్రమంలో కొత్తపల్లి రవి, సూర్యం, భాస్కర్ రెడ్డి, సంపత్, పుల్లయ్య పాల్గొన్నారు.

మీడియా పాయింట్‌లో విద్యుత్ లేక ఇబ్బందులు

సమయానికి అందని ఎన్నికల సమాచారం

మహబూబాబాద్ రూరల్, జూన్ 4 : పట్టణంలోని సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన పార్లమెంట్ ఎన్నికల కౌంటింగ్ కేంద్రంలోని మీడియా పాయింట్‌లో సరైన సౌకర్యాలు లేక మీడియా సంస్థల ప్రతినిధులు ఇబ్బందిపడ్డారు. ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభమైన 40 నిమిషాల తర్వాత మీడియాకు కేటాయించి గురుకుల 'బి' బ్లాక్ మొత్తం ఒకేసారి విద్యుత్ పోయింది. బీ బ్లాక్‌కు కరెంట్ వచ్చే విద్యుత్ వైర్లు కాలి పోయాయి. కరెంట్ లేక వివిధ ప్రాంతాల నుంచి కౌంటింగ్ సమాచారం కోసం వచ్చిన మీడియా సంస్థల ప్రతినిధులు, స్థానికులు అరగంటపాటు తీవ్ర ఇబ్బందిపడ్డారు. అధికారుల సమాచారంతో చేరుకున్న విద్యుత్ అధికారులు గంట పాటు మరమ్మతు చేసి కరెంట్ సరఫరాను పునరుద్ధరించారు. మీడియా కోసం స్క్రీన్‌ను సిద్ధం చేసి సమాచారం అందించారు.

గుడుంబా స్థావరాలపై ఎక్సైజ్ దాడులు

డోర్నకల్, జూన్4: మండలంలోని వెన్నారం, రామకుంటతండాలోని గుడుంబా స్థావరాలపై ఎక్సైజ్ పోలీసులు సోమవారం దాడులు నిర్వహించారు. ఎక్సైజ్ ఎస్సై అశోక్ కథనం ప్రకారం.. రాముకుంట తండా నుంచి వెన్నారం గ్రామానికి గుడుంబా రవాణా చేస్తున్న తేజావత్ దస్రు, తేజావత్ వంశీని అరెస్టు చేసి, వారి నుంచి 20 లీటర్ల గుడుంబా, రవాణాకు ఉపయోగించిన బైకును స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేశాడు. దాడుల్లో హెచ్‌సీ మధు, శ్రీనివాస్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పట్టుబడిన నిందితులను చూపుతున్న ఎక్సైజ్ ఎస్సై అశోక్

గాయపడిన విద్యార్థికి ఆర్థిక సాయం

మహబూబాబాద్ రూరల్, జూన్ 4 : ప్రమాదంలో గాయపడిన పూలే గురుకుల విద్యాలయానికి చెందిన విద్యార్థి వరికోలు సాయిచరణ్ తల్లిదండ్రులకు మంగళవారం పట్టణంలోని వారి నివాసంలో టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో రూ.30వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు చుంచు శ్రీశైలం మాట్లాడుతూ.. గాయపడి నిస్సహాయ స్థితిలో ఉన్న బాలుడికి తమవంతుగా ఆర్థిక సాయం చేశామని, మరింతమంది దాతలు ముందుకొచ్చి సాయం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిద్దోజు కవిత, విష్ణువర్ధన్, రమేశ్, ఉపేందర్ పాల్గొన్నారు.

సాయిచరణ్ కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందిస్తున్న టీపీటీఎఫ్ నాయకులు

వృథాగా పోతున్న భగీరథ నీరు

దంతాలపల్లి, జూన్ 4 : అధికారుల నిర్లక్ష్యం కారణంగా మిషన్ భగీరథ నీరు వృథాగా పోతున్నది. దంతాలపల్లి మండలం బీరిశెట్టిగూడెం గ్రామంలో మిషన్ భగీరథ పైపులైన్ లీకై నీరు వృథాగా పోతుండడంతో గ్రామంలోని వీధులన్నీ బురదమయమవుతున్నాయి. అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పైపులైన్ లీకేజీలకు మరమ్మతు చేయించి నీటి వృథాను అరికట్టాలని కోరుతున్నారు.

వృథాగా పోతున్న తాగునీరు

రేపటి నుంచి ఆర్ఎంపీల ఆందోళన

సమస్యలు పరిష్కరించాలని నిరాహారదీక్ష

దేవరుప్పుల, జూన్ 4 : ఆర్ఎంపీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 6 నుంచి 16వ తేదీ వరకు జిల్లాలోని ఆర్ఎంపీ, పీఎంపీలు ఆందోళన నిర్వహించనున్నట్లు ఆర్ఎంపీల సంఘం మండల అధ్యక్షుడు మేకపోతుల వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో జిల్లా అధ్యక్షుడు పసునూరి సత్యనారాయణ, మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్లు పాల్గొని ఆందోళనకు సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీఎస్ఎంసీ పేర ఆర్ఎంపీ, పీఎంపీలపై రాష్ట్ర ప్రభుత్వం దాడులు చేయిస్తున్న నేపథ్యంలో తాము జిల్లా వ్యాప్తంగా ఆందోళనకు పిలుపునిచ్చినట్లు వివరించారు. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం జిల్లా కేంద్రంలోని నెహ్రూ పార్కు నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహిస్తామని వారు వివరించారు. అనంతరం కలెక్టరేట్ ముందు రిలే నిరాహార దీక్షలు చేపడుతామని తెలిపారు. జిల్లాలోని 800మంది ఆర్ఎంపీ, పీఎంపీలు ఈ ర్యాలీలో పాల్గొంటారని వారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మంతెన రమేశ్, వర్కింగ్ ప్రెసిడెంట్ మంగ రామకృష్ణ, మండల ఉపాధ్యక్షుడు గుండు సుధాకర్, కోశాధికారి తీగల సత్యనారాయణ, కార్యవర్గ సభ్యులు కర్రె శ్రీశైలం, ప్రభాకర్, కొంగ సతీశ్ పాల్గొన్నారు.

కేయూ రిటైర్డ్ ప్రొఫెసర్ రాజయ్యకు నివాళి

హనుమకొండ చౌరస్తా, జూన్ 4: కాకతీయ యూనివర్సిటీ అర్థశాస్త్ర విభాగ విశ్రాంత ప్రొఫెసర్ రాజయ్య సోమవారం మధ్యాహ్నం మృతిచెందారు. అర్థశాస్త్ర విభాగాధిపతి ఆచార్య సురేష్‌లాల్ ఆధ్వర్యంలో రాజయ్య చిత్రపటానికి పూల మాలవేసి నివాళులర్పించారు. ప్రొఫెసర్ రాజయ్య అర్థశాస్త్ర విభాగాధిపతిగా, పాఠ్యప్రణాళిక అధ్యక్షుడిగా, అభివృద్ధి అధికారిగా, యూపీజీసీ ప్రిన్సిపాల్‌గా గతంలో పని చేశారని క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సురేష్‌లాల్ తెలిపారు. అర్థశాస్త్ర విభాగం అధ్యాపకులు విద్యాసాగర్, సాంబశివరావు, రాజేశ్, రమేశ్, బోధనేతర సిబ్బంది కొమురమ్మ పాల్గొన్నారు.

రాఘవపూర్‌లో పట్టాలు తప్పిన గూడ్స్ రైలు

కాజీపేట, జూన్ 4: కాజీపేట రైల్వే జంక్షన్–బల్లార్ష సెక్షన్‌లోని రాఘవపూర్ రైల్వేస్టేషన్ సమీపంలో మంగళవారం గూడ్స్ రైలు బోగీలు పట్టాలు తప్పాయి. దీంతో గూడ్స్ రైలు బోగీలను తిరిగి పట్టాలపై సరిచేసేందుకు సిబ్బంది బ్రేక్ డౌన్ వ్యాన్ రైలులో తరలివెళ్లారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

jobs Apply Now!

★ త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073. NT-327729

WANTED FEMALE TELECALLERS

★Urgent Requirement for ICICI, HDFC Bank Personal Loans Fresher Female Tele-Callers, Vacancies: 40, Sal+Inc. etc.., Job Location: HNK, Cont: 8886188690. NTW-5697

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads Please Contact...
9182777552 HANAMKONDA
9182777563
9182777618
WARANAGAL 9182777556
JAYASHANKAR BHUPALPALLY 9182777559
MULUGU 9182777135
MAHABUBABAD 9182777557
JANGAON 9182777565

షార్ట్ సర్క్యూట్‌తో కిరాణాషాపు దగ్ధం

- మహిళకు తీవ్ర గాయాలు
- సుమారు రూ.5లక్షల నష్టం

నర్సింహులపేట, జూన్ 4 : షార్ట్ సర్క్యూట్‌తో కిరాణాషాపు దగ్ధమవడంతోపాటు మహిళకు తీవ్ర గాయాలైన ఘటన మండలంలోని బొజ్జన్నపేట గ్రామంలో మంగళవారం రాత్రి జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. బొజ్జన్నపేట గ్రామానికి చెందిన కందునూరి రాజు మూడేళ్లుగా కిరాణా దుకాణం నడిపిస్తున్నాడు. రాత్రి సమయంలో షార్ట్ సర్క్యూట్ జరిగి షాపులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దుకాణంలో ఉన్న రాజు భార్య స్రవంతికి మంటలు అంటుకోగా, స్థానికులు గమనించి కరెంట్ సరఫరాను బంద్ చేయించి, ఆమెను బయటకు తీశారు. అప్పటికే స్రవంతికి గాయాలు కాగా, చికిత్స నిమిత్తం 108 వాహనంలో జిల్లాకేంద్రంలోని వైద్యశాలకు తరలించారు. అనంతరం మరిపెడ నుంచి ఫైర్ ఇంజిన్ వచ్చి మంటలను ఆర్పివేసింది. దుకాణంలో సుమారు రూ. 5లక్షల వరకు వస్తుసామగ్రి కాలి బూడిదైందని, ప్రభుత్వం ఆదుకోవాలని రాజు కోరాడు.

కాలిపోతున్న కిరాణా దుకాణం,(ఇన్‌సెట్) మంటలతో గాయాలైన స్రవంతి

కేయూలో నూతన విభాగాధిపతుల నియామకం

హనుమకొండ చౌరస్తా, జూన్ 4: కాకతీయ విశ్వవిద్యాలయంలోని పలు విభాగాల్లో ఇన్‌చార్జి వైస్ చాన్స్‌లర్ వాకాటి కరుణ ఆదేశాల మేరకు నూతన అధిపతులను నియమిస్తూ రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. సోషియాలజీ విభాగాధిపతిగా ప్రొఫెసర్ టి.శ్రీనివాస్, ఫిజిక్స్ విభాగాధిపతిగా డాక్టర్ జి.మంజుల, గణితశాస్త్ర విభాగాధిపతిగా డాక్టర్ ఆర్.భారవిశర్మ, బొటనీ విభాగాధిపతిగా డాక్టర్ ఎం.లలితకుమారి, జియాలజీ విభాగాధిపతిగా ప్రొఫెసర్ ఆర్.మల్లికార్జునరెడ్డి నియామకమయ్యారు. వీరు ప్రస్తుత విభాగాధిపతుల నుంచి బాధ్యతలు స్వీకరించనున్నారు. వీరిని బోధనా, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు అభినందించారు.

నూతన విభాగం అధిపతులతో రిజిస్ట్రార్ మల్లారెడ్డి

నేడు, రేపు ఐసెట్

- దరఖాస్తు చేసుకున్న 86,514 అభ్యర్థులు
- వరంగల్, నర్సంపేట రీజియన్‌లో 8 పరీక్షా కేంద్రాలు
- నిమిషం ఆలస్యమైనా అనుమతి లేదు
- ఐసెట్ కన్వీనర్ ప్రొఫెసర్ నర్సింహాచారి

హనుమకొండ చౌరస్తా, జూన్ 4: తెలంగాణ రాష్ట్రంలో 2024–25 విద్యాసంవత్సరానికి ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాల కోసం ఐ సెట్ 5, 6న నిర్వహించనున్నట్లు ఐ సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ ఎస్.నరసింహాచారి తెలిపారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో ఎంపిక చేసిన కేంద్రాల్లో జరిగే టీజీఐసెట్–2024కు మొత్తం రెండు తెలుగు రాష్ట్రాల్లో 86,514 మంది అభ్యర్థులు పరీక్షకు నమోదు చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5గంటల వరకు మళ్లీ 6వ తేదీన ఉదయం 10 నుంచి 12.30 గంటల వరకు మూడు సెషన్స్ ఉంటాయని, నిమిషం ఆలస్యమైనా పరీక్ష హాల్‌లోకి అనుమతించేది లేదని తెలిపారు. వరంగల్, నర్సంపేట రీజియన్‌లో మొత్తం 8 పరీక్ష కేంద్రాల్లో మూడు సెషన్లలో 4,659 మంది పరీక్ష రాయనున్నట్లు తెలిపారు. నర్సంపేట జయముఖి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సైన్సెస్, బాలాజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సైన్సెస్, వరంగల్, హనుమకొండలో కాకతీయ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సైన్సెస్, వశిష్ట టెక్నాలజీస్, తాళ్ల పద్మావతి కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్, వాగ్దేవి కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్, బొల్లికుంట, చైతన్య డీమ్డ్ టుబీ యూనివర్సిటీ, కిషన్‌పురా, నోబెల్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ చింతగట్టు, హసన్‌పర్తి ఉన్నాయని వివరించారు.

యువతిని మోసగించిన వ్యక్తిపై కేసు

కొడకండ్ల, జూన్ 4 : మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతిని ప్రేమించి పెళ్లి చేసుకుంటానని మోసగించిన ఘటనలో వరంగల్ నగరానికి చెందిన పుల్లూరు గోవిందర్‌రాజ్‌పై పోలీసులు నమోదు చేశారు. దీనికి సంబంధించిన వివరాలను సీఐ మహేందర్‌రెడ్డి మంగళవారం విలేకరులకు తెలిపారు. సీఐ మాట్లాడుతూ యువతిని మోసగించిన గోవిందరాజ్‌పై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుప్చామని వివరించారు. ఎవరైనా ఆడపిల్లలతో ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని మోసం చేస్తే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అవసరమైతే పీడీ యాక్ట్ నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు. సమావేశంలో ఎస్సై శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

భూతగాదాలో ఇరువర్గాల ఘర్షణ

ట్రాక్టర్ ట్రాలీ పడి మహిళ మృతి

రఘునాథపల్లి జూన్ 4: భూ తగాదాలో ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో మహిళ మృతి చెందిన ఘటన మండలంలోని ఆంధ్రతండాలో మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రతండాకు చెందిన భూక్యా గణేశ్ –మంగమ్మ(40) దంపతులు. వీరికి గ్రామ శివారులోని గుట్ట సమీపంలో మూడెకరాల వ్యవసాయ భూమి ఉంది. వ్యవసాయ క్షేత్రంలోకి వెళ్లడానికి పొత్తుల దారి ఉంది. ఈ క్రమంలో గ్రామానికి చెందిన మాలోత్ శివాద్రి, ధరావత్ బీల్యా ట్రాక్టర్ సాయంతో పొత్తుల రోడ్డుకు మంగళవారం మట్టిని పోస్తున్నారు. మంగమ్మ అక్కడి వెళ్లి ఇక్కడ ఎందుకు మట్టి పోస్తున్నారని అడ్డు పడింది. దీంతో మట్టి పోస్తున్న బీల్యా కుమారుడు రవీందర్, శివాద్రి, మాలోత్ కాళీ ఆగ్రహంతో మంగమ్మతో గొడవపడి ఆమెను నెట్టేశారు. దీంతో ఆమె కిందపడడంతో ట్రాక్టర్‌లో ఉన్న మట్టిని కిందకు పోయమని బీల్యా తన కుమారుడైన రవీందర్ కు సైగ చేశాడు. దీంతో మట్టిని పోసేందుకుకు ట్రాక్టర్ జాకీని లేపాడు. దీంతో ట్రాలీ మంగమ్మ మీద పడడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలికు భర్త, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై దూదిమెట్ల నరేశ్ యాదవ్ తెలిపారు.

మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు